క్లుప్తంగా

అధికారులు అందుబాటులో ఉండాలి

ఓజిలి: మండల రెవెన్యూ అధికారులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ నాంచారయ్య ఆదేశించారు. ఆయన సోమవారం వీఆర్వోలు, బీఎల్‌వోలు, వీఆర్‌ఏలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ వెలువడనున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వీఆర్వోలను ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ల పరిశీలన

ఓజిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల సాగుకు సంబంధించిన కషాయాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్, ఏపీఎం నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

దక్కిలి : విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. ఆయన సోమవారం నాగవోలు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం జగనన్న గోరుముద్దను అమలుచేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయురాలు తోట జ్యోతి ఉన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది, అధికారులు

దొరవారిసత్రం : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద సోమవారం శ్రీధనమల్లి పంచాయతీ మానేరిలోని 130 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ హక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేవతి, పంచాయతీ కార్యదర్శి ఖాదర్ మస్తాన్, వీఆర్వో మధు, నాయకులు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

సైదాపురం: పొదుపు మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా అడుగు ముందుకు వేస్తున్నట్టు ఏపీఎం రాధ తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో సోమవారం వీవోఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) సభ్యులకు లకపతి దీదీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి వీవోఏ పరిధిలో 30 శాతం మంది ఆర్థికంగా అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పథకాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. తద్వారా మహిళలు లక్షాధికారులు అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

యువకుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

నాయుడుపేట టౌన్ : మండలంలోని మూర్తిరెడ్డి పాళెం సమీపంలో ఆదివారం ప్రమాదంలో మృతిచెందిన నెల్లూరుకు చెందిన గుర్రం హేమంత్ కుమార్(19), రాచగిరి వెంకటేష్(21) మృతదేహాలకు సోమవారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నెల్లూరు రూరల్ పరిధిలోని చెముడుగుంట నక్కల గిరిజన కాలనీకి చెందిన గుర్రం ప్రసాద్ కుమారుడు హేమంత్ కుమార్, రాచగిరి శ్రీనివాసులు కుమారుడు వెంకటేష్ బేకరీలో పనిచేస్తున్నారు. వారు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సైదాపురం: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని రాపూరు సీడీపీవో సునంద తెలిపారు. స్థానిక ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార పక్షోత్సవాలు ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పాలు, గుడ్లు, రాగి పిండి, శనగచెక్కి, బెల్లం, బాలామృతంతోపాటు కిలో అటుకులు, కిలో సజ్జ పిండి, కేజీ కర్జూరం ఇస్తున్నట్టు వివరించారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి

బాలాయపల్లి(దక్కిలి): చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. ఆమె సోమవారం వెంకటరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా నిర్వహించారు. సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగనవాడీ వర్కర్స్ పాల్గొన్నారు. అదేవిధంగా దక్కిలి మండలం లింగసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా నిర్వహించారు. నాగవోలు సెక్టారు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత పాల్గొని పౌష్టికార లోపం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు

వెంకటగిరి (సైదాపురం) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపారని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం సుదర్శనం నగర్‌లోని సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన జగనన్న

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

దొరవారిసత్రం : జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పేదల సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో ఇచ్చిన స్థలాలకు పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తూ పత్రాలు అందజేస్తున్నట్టు తెలిపారు. డీవీసత్రంలో 622 మందికి ఇంటి స్థలాలు కేటాయించగా 554 మందికి రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు ఇచ్చినట్టు వివరించారు. సీఎం జగనన్న చేసిన మేలును గుర్తించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. సూళ్లూరుపేట చెంగాళ్లమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఆర్డీవో చంద్రముని, మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్, తహసీల్దార్ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజు, రమణారెడ్డి, మునస్వామినాయుడు, ప్రసాద్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇంటి కల నేరవేరింది



లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

సూళ్లూరుపేట రూరల్ : పేదలకు స్థలం ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసి భద్రత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సూళ్లూరుపేట మండలంలోని 496 మందికి, పట్టణంలోని 987 మందికి, తడ మండలంలోని 565 మందికి ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఆర్డీవో చంద్రముని, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్‌రెడ్డి, తడ ఎంపీపీ రఘురెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కళత్తూరు శేఖర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పోలూరు పద్మ, చిన్ని సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ అయితా శ్రీధర్ పాల్గొన్నారు.



సూళ్లూరుపేట : కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

జగన్ వెంటే జనం



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థిరస్థాయిగా నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందుకు నిదర్శనం మేదరమిట్లలో ఆదివారం జరిగిన సిద్ధం సభ అని పేర్కొన్నారు. ఆయన సోమవారం వైఎస్సార్ సీపీ అబ్జర్వర్ ఎంఆర్సీ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి వాకాడులో పర్యటించారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహాన్ని ఈ నెల 13న వాకాడులో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న పనులను వారు పరిశీలన చేశారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జనార్దన్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విచ్చేస్తున్నట్లు తెలిపారు. జనార్దన్‌రెడ్డి అభిమానులతోపాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవతం చేయాలని కోరారు. కొడవలూరు దామోదర్‌రెడ్డి, బుర్లా విష్ణువర్ధన్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వాకాటిరవి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళా సాధికారత

గూడూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళా సాధికారత సాధ్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయ కర్త మేరగ మురళీధర్ తెలిపారు. ఆయన సోమవారం సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో మహిళలకు నాలుగో విడత చేయూత కింద రూ.6.99 కోట్ల చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు మండలంలో 3,728 మంది మహిళలకు చేయూత కింద లబ్ధి చేకూర్చినట్టు తెలిపారు. తద్వారా వారు చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవన ప్రమాణాలను పెంపొందించుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం మహిళలు సీఎం జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ, సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ బూదూరు గురవయ్య, జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ మల్లు విజయకుమార్ రెడ్డి, జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్ర రెడ్డి, నాయకులు యల్లా శ్రీనివాసులురెడ్డి, క్రిష్ణయ్య, జనార్ధనరెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నాయకులు

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేద్దాం

చిల్లకూరు : గూడూరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని పార్టీ కళ్యాణదుర్గం పరిశీలకులు ఎంఆర్‌సీరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి బూదనం సమీపంలోని ఒక హోటల్‌లో గూడూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమీక్షిస్తున్న ఎంఆర్‌సీరెడ్డి

కోలాహలంగా వసంతోత్సవం

నాయుడుపేట టౌన్ : స్థానిక స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పార్వతి పరమేశ్వరుల నగరోత్సవం చేపట్టారు. ఆలయ ధర్మకర్త గూడూరు సుధీర్ రెడ్డి దంపతులు, శివ భక్తుల సారధ్యంలో గంధాభిషేకం, జలాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతోపాటు తిశూలలను ఊరేగింపుగా స్వర్ణముఖి నది వద్దకు తీసుకెళ్లి చక్రస్నానం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. దీనికి ఉభయకర్తలుగా స్థానిక వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మల్లు నీరజ, ఎస్ సురేష్ దంపతులు, గోపాల్ వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అమరేందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. రాత్రి పార్వతీ పరమేశ్వర్ల ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేకంగా తయారు చేయించిన రథంపై ప్రతిష్టించి పట్టణంలో ఊరేగించారు.



చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు, ఆలయ నిర్వాహకులు

రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలో సుమారు రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం, గడప గడపకూ మన ప్రభుత్వం, సాధారణ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్, వైస్ చైర్మన్ జె వెంకట కృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యులు చదలవాడ కుమార్, కౌన్సిలర్లు డీ రవి, పీ చంద్రారెడ్డి, షేక్ షబ్బీర్, కే అశోక్‌కుమార్, పీ నాగార్జున, ఆర్ సరితా, ఎస్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలోని విద్యార్థులకు సోమవారం రోటరీ వెస్ట్ క్లబ్ ప్రతినిధులు బెంచీలు వితరణ చేశారు. డాక్టర్ లక్ష్మీ పీఎంరావ్, డాక్టర్ బాలసుబ్రమణ్యం, ఎస్ఎల్ఎన్ బాబు దాతృత్వంతో బెంచీలను అందించారు. క్లబ్ అధ్యక్షుడు సనత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సరస్వతి శిశు మందిరంలో పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను నేర్పిస్తున్నారని తెలిపారు. ధనుంజయరెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, గిరిబాబు, నాగరాజారెడ్డి, సిద్దారెడ్డి, రవిచంద్ర, హెచ్‌ఎం రంగనాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ దీక్షలు

నాయుడుపేట టౌన్ : ముస్లింలు పవిత్రంగా జరుపుకునే రంజాన్ మాసం సందర్భంగా సోమవారం రాత్రి తరాబి నమాజు ప్రారంభించారు. జామీయా మసీదు మత పెద్దలు ఉపవాస వేడుకలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. రంజాన్ మాస నెలవంకను కనిపించడంతో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జామియా మసీదు, దర్గా వీధిలో వున్న అమీర్‌షావలి మసీదు, పాత బస్టాండు వద్ద నూరు మసీదు, అమరా గార్డెన్ వీధిలో వున్న మక్కా మసీదు, బీడీకాలనీ, మునిరత్నం నగర్, పొగగొట్టం, చంద్రబాబు కాలనీ తదితర ప్రాంతాల్లోని మసీదుల వద్ద తరాబి ప్రత్యేక నమాజు ప్రారంభించారు. ఇఫ్తార్ విందుతో పాటు నమాజు నిర్వహిస్తున్నట్లు మతపెద్దలు, ముతవల్లీలు తెలిపారు.

గూడూరు రూరల్‌లో..

గూడూరు రూరల్ : నెలవంక కనిపించడంతో మంగళవారం నుంచి రంజాన్ మాసం ఉపవాస ప్రార్థనలు ప్రారంభించనున్నట్టు జామియా మసీదు మత పెద్దలు తెలిపారు. నెలవంక కనిపించిన సందర్భంగా సోమవారం జామియా మసీదు వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

న్యాయం చేయాలని వినతి

బాలాయపల్లి (దక్కిలి): తమ భూములపై నకిలీ డాక్యుమెంట్లతో రుణాలు తీసుకోవడంతోపాటు దౌర్జన్యానికి దిగుతున్నారని కయ్యూరుకు చెందిన యాచవరం సొసైటీ అధ్యక్షుడు రావిళ్ల వెంకటకృష్ణమనాయుడు వాపోయారు. ఆయన సోమవారం తిరుపతిలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ అక్కసముద్రం రెవెన్యూ లెక్క దాఖలా సర్వేనెంబర్ 183–2, 3, 4, 5, 6లో తన భార్య రావిళ్ల విజయమ్మ పేరుతో ఐదెకరాల పొలం ఉందన్నారు. దానిపై వెంకటగిరి సొసైటీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న యాచవరానికి చెందిన గొట్టి సత్యనారాయణ, అతని కుటుంబ సభ్యులు గొట్టి సుమతి, గొట్టి బాలాజీ, గొట్టి లత, గొట్టి సరోజనమ్మ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి జయంపు సొసైటీలో రుణాలు తీసుకున్నారని తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు

వెంకటగిరి రూరల్ : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో సోమవారం కేంద్ర బలగాలు వెంకటగిరి చేరుకున్నాయి. స్థానిక సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో వెంకటగిరిలో కవాతు నిర్వహించాయి. సీఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానిక ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, జిత్యానాయక్, డక్కిలి ఎస్ఐ చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

రాపూరు: మండలంలో సాగు చేసిన వేరుశనగ పంటను సోమవారం వ్యవసాయ అధికారి సోమసుందర్ పరిశీలించారు. వెంకటేశ్వరపురంలో వేరుశనగ పంటకు మచ్చ తెగులు, దోమపోటు ఆశించినట్టు తెలిపారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉందని, ఎకరాకు 200 కేజీల జిప్సం వేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు.

ఉద్యోగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండ

నాయుడుపేట టౌన్ : ఉద్యోగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నాయుడుపేటకు చెందిన వి.దేవప్రసన్నకుమార్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఇందులో ఎమెల్యే పాల్గొని ఆయనను అభినందించారు. దయాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో మహిళా దినోత్సవం



ఎన్‌బీకేఆర్‌లో మహిళా దినోత్సవం

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా అపోలో హాస్పిటల్ డాక్టర్ రస్మిరెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. ఉన్న అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, కార్యక్రమ కోఆర్డినేటర్ ఇందుమతి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అపహరణకు యత్నం

కోట: విద్యానగర్ ఎన్టీఆర్ గిరిజన కాలనీలో సోమవారం బాలికను అపహరించేందుకు యత్నించిన వ్యక్తిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. రుద్రవరానికి చెందిన శ్రీనివాసులు ఎన్టీఆర్ కాలనీలో బాలిక(8)ను తీసుకెళుతుండగా స్థానికులు దేహశుద్ధి చేశారు. ఏఎస్ఐ శోభారాణి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు.